# గణపతి సచ్చిదానంద స్వామిని దర్శించుకున్న మంత్రి తుమ్మల



దమ్మపేట, సూర్య (మేజర్ న్యూస్) - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు ఆశ్రమంలో ఉన్నటువంటి మైసూర్ దత్త పీఠాధిపతి శ్రీ శ్రీ సచ్చిదానంద స్వామి వారిని మకర సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, చేనేత, టెక్స్టైల్స్ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆశీర్వాచనం అందుకొని స్వామి వారు చేసిన సూచనలను స్వీకరిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.స్వామివారిని దర్శించుకున్న వారిలో మంత్రి తుమ్మల తో పాటు పామ్ ఆయిల్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, తదితరులు ఉన్నారు.


సూర్య www.suryaa.com 18వ వసంతంలోకి...




గురువారం 16, జనవరి 2025 8 పేజీలు


# ఈ నెల 26వ తేదీన కానున్న నాలుగు సంక్షేమ పథకాలు



- లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను విజయవంతం చేయాలి
- లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ
- మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం
- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలి
- జిల్లా, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలి
- ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేయాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

కొత్తగూడెం కలెక్టరేట్, సూర్య (మేజర్ న్యూస్)- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు) విధివిధానాలపై బుధవారం అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కొత్తగూడెం,భద్రాచలం ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, తదితర అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు అవగాహన కల్పించారు.

2లో



- లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ
- అర్హులందరికి ప్రభుత్వ ఫలాలు అందాలి
- 4 క్రొత్త పథకాల అమలుపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

## నాలుగు సంక్షేమ పథకాల సర్వే ప్రక్రియ

# పారదర్శకంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, సూర్య బ్యూరో జనవరి - 15 : రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి అమలుచేయనున్న 4 సంక్షేమ పథకాల క్షేత్ర స్థాయి సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం అమలు చేయనున్న 4 పథకాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, క్రొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రభుత్వం విధి విధానాలు జారీచేసిందన్నారు. పథకాల అమలుపై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు పథకాల లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతు భరోసా క్రింద ప్రభుత్వం వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎకరాకు సంవత్సరానికి 12 వేలు ఇవ్వనుందని కలెక్టర్ అన్నారు.

2వ పేజీలో...

# న్యాయస్థానంపై నమ్మకం ఉంది



- ఆధారాలు లేని ఆరోపణలే.. ఎలాంటి ఇబ్బంది లేదు
- ఐదేళ్ల పదవికి ఎలాంటి డోకా ఉండదు
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, సూర్య(మేజర్ న్యూస్) - 'ఎన్నికల అఫిడవిట్'లో లోపాలున్నాయని చేస్తున్న ఆరోపణలపై ఎలాంటి ఆధారాలు లేవని, న్యాయ స్థానంపై నమ్మకం ఉందని, సమగ్రంగా విచారించి క్లీన్ చిట్ ఇస్తుందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.

2లో





# పత్తి మార్కెట్లో భారీ అగ్నిప్రమాదం

మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆరా
విచారణకు ఆదేశం

ఖమ్మం బ్యూరో సూర్య న్యూస్ : ఖమ్మం వ్యవసాయ పత్తి మార్కెట్లో బుధవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగింది. భారీగా దగ్గమవుతున్న పత్తి బస్తాలు చూసి చుట్టుపక్కల వారు మార్కెట్ అధికారులకు, పోలీసులకు, ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. సెలవ రోజు కావడంతో అధికారులు స్పందన ఆలస్యమైంది. మంటలను నియంత్రించేందుకు ఫైర్ సిబ్బంది శాయ శక్తులు ప్రయత్నిస్తున్నారు. మంటలు ఎలా అడ్డుకున్నాయనేది ప్రస్తుతానికి అర్థం కావడం లేదు. 400 పత్తి బస్తాలు పైగా కాలిపోయినట్లు ప్రాథమిక సమాచారం. ఖరీదు చేసిన పత్తి మంటల్లో కాలి పోవడంతో వ్యాపారులు ఆవేదన చెందుతున్నరు.

2వ పేజీలో...

# డయాలసిస్ యూనిట్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



కొత్తగూడెం కలెక్టరేట్, సూర్య (మేజర్ న్యూస్)-కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి అదనంగా కేటాయించబడిన డయాలసిస్ యూనిట్లను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ జితేశ్విని పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రతి వార్డును కలెక్టర్ పరిశీలించారు.

2లో

# ఈ నెల 26వ తేదీన కానున్న నాలుగు సంక్షేమ పథకాలు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలును ఈనెల 26న ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామ సభలను పక్కాగా నిర్వహించాలని, ఈ నెల 16 నుంచి 20 వరకు చేపట్టే క్షేత్రస్థాయి సర్వే లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని, అలాగే 16 వ తేదీ నుంచి 20 వరకు లబ్ధిదారుల ముసాయిదా జాబితా తయారీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభలు పక్కాగా జరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, 21 వ తేదీ నుంచి 25 వరకు డేటా ఎంట్రీ లో తప్పులు దొర్లకుండా చూడాలని, ఫ్లెక్సీ లు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో ప్రచురించాలని, గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులపై రిజిస్టర్‌లను, కంట్రోల్ రూం లను ఏర్పాటు చేసి, అర్జీలను స్వీకరించాలని తెలిపారు. ఈ సర్వే, గ్రామ సభల పట్ల ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

### రైతు భరోసా పథకం

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు గాను వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12వేలు భూ భారతి (ధరణి) పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందని, అలాగే ఇళ్లు (లేదా) కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ భూములు, లేఅవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు, రాళ్ళు, రప్పలు, గుట్టలతో నిండి, సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి, తొలగించాలని సూచించారు. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రతి రెవెన్యూ గ్రామాల వారీగా ఏఈఓ, ఆర్ఐ, సర్వేయర్ లు ఒక బృందంగా ఏర్పడి, కలిసికట్టుగా పనిచేయాలని, ఇందుకోసం ఆయా మండలాల తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి బాధ్యులుగా ఉంటారని, వారు సంయుక్తంగా జాబితాలోని అన్ని సర్వే నంబర్ లను క్షేత్రస్థాయిలో సందర్శించి, వ్యవసాయానికి యోగ్యం కానీ భూములను ధృవీకరించుకోవాలని ఆదేశించారు. 3 లేదా 4 గ్రామాలకు కలిపి ఒక మండల స్థాయి క్లస్టర్ నోడల్ అధికారిని నియమించాలని, అలాగే ఈ ప్రక్రియ మొత్తాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులన్నీ క్రోడీకరించుకోవడంతో పాటు గ్రామాల మ్యాపులను పరిశీలించాలన్నారు. ఈ యోగ్యం కాని భూముల జాబితాను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా రూపొందించాలని, ఈ జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించాలని,చదివి వినిపించాలని, చర్చించిన తర్వాతనే వెల్లడించాలని తెలిపారు.

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని వ్యవసాయ కూలి కుటుంబానికి రూ. 6వేలు చొప్పున రెండు విడతలుగా రూ. 12వేలు నగదు సాయం అందించనున్న నేపథ్యంలో 2023-24 సంవత్సరానికి గాను కనీసం 20 రోజులు ఉపాధి హామీ పని దినాలు పూర్తిచేసుకున్న భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రస్థాయి నుంచి జిల్లాల వారీగా వచ్చిన ముసాయిదా అర్హుల జాబితాలో లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును, ఆధార్ కార్డుతో లింక్ చేయాలని, లేని వాటిని నవీకరించాలని, ఈ ప్రక్రియకు బాధ్యులుగా ఎంపిడిఓ ఉంటారని, ఎంపిడిఓలు, ఎంపిఓలు సమన్వయంతో పనిచేయాలని, అలాగే ప్రతి గ్రామ సభల్లో ఈ జాబితాను ప్రచురించాలని, చదివి వినిపించాలని, ఎలాంటి అపోహలు తలెత్తకుండా గ్రామ సభల్లో చర్చించి, ఆమోదించడం జరుగుతుందని సూచించారు. ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు గ్రామ సభల్లో వస్తే, వాటిని స్వీకరించి, పరిశీలించి, పది రోజుల్లోగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### కొత్త రేషన్ కార్డులు

కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు) పథకంలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి నుంచి అన్ని జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని పేద కుటుంబాల జాబితా ప్రకారం పరిశీలించాలని, ఇందుకోసం జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఎస్ఓ పర్యవేక్షకులుగా వ్యవహరించాలని, మండల స్థాయిలో ఎంపిడిఓ, మున్సిపాలిటీలో మునిసిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారని, అలాగే భూములు, ఆదాయం తదితర అంశాలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు గుర్తించాలని, పంచాయతీ కార్యదర్శులు కుటుంబాల వివరాలను సేకరించాలని సూచించారు. అందుకు సంబంధించిన ఫీల్డ్ వెరిఫికేషన్ ఫార్మ్ లో కుటుంబాల సమగ్ర వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసి, ఈ ముసాయిదా జాబితాను గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించాలని, చదివి వినిపించాలని, చర్చించిన తర్వాతే అమోదించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఒక రేషన్ కార్డు ఒక వ్యక్తికి ఒకే చోట ఉండాలన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల పథకం

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జీఓ నంబర్ 7 ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గృహాలు, ఇళ్లు లేనివారు, పూరిగుడిసెలు ఉన్నవారు, అద్దె ఇళ్లలో నివాసం ఉన్నవారు, నిర్మాణానికి స్థలం ఉన్నవారు అర్హులను తెలిపారు. ఇందులో భాగంగా మట్టి గోడలు, పైకప్పు లేని గృహాలు, వితంతువులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందుకోసం ఈ నెల 18 లోగా ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్ లాగిన్ లలో ఎటువంటి లోపాలు దొర్లకుండా సూపర్ చెక్ ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒకటే ఇల్లు కేటాయించేందుకు గాను ఏఐ, జియో ట్యాగింగ్ ద్వారా డీడూప్లికేషన్ చేయాలని సూచించారు. అలాగే ఏమైనా పొరపాట్లు ఉంటే పీడీ హౌసింగ్ కు పంపించాలని, వివరాలను సరిదిద్దేందుకు ఎడిట్ ఆప్షన్ కల్పించినట్లు వివరించారు. అదే విధంగా గ్రామ సభల నిర్వహణకు యాక్షన్ ప్లాన్ ను తయారు చేయాలని, గ్రామ సభలకు ఆర్ఐ, ఏఈఓ, పంచాయతీ కార్యదర్శి బృందంగా ఏర్పడాలని, వార్డు సభలకు వార్డు అధికారి, డిప్యూటీ తహసీల్దార్, ఏఈ బృందంగా ఉండాలని, 4 (లేదా) 5 గ్రామాలకు కలిపి క్లస్టర్ వారీగా ఎంపిడిఓ, తహసీల్దార్, సూపరింటెండెంట్ సమన్వయ బృందంగా నియమించాలని సూచించారు. ఈ మొత్తం సంక్షేమ పథకాల ప్రక్రియలు మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ ప్రక్రియకు సరిపడా కంప్యూటర్ లను ఏర్పాటు చేయాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్ లను అందుబాటులోకి తీసుకోవాలని, ప్రతి క్లస్టర్ వారీగా ఒక సిస్టమ్ ఉండాలన్నారు. అలాగే ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రతులను, గ్రామ సభల తీర్మాన ప్రతులను సురక్షితంగా, ఎంతో జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు.

## నాలుగు సంక్షేమ పథకాల సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి

అధికారులు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలన్నారు. జిల్లాలో మొత్తం 589 గ్రామాలు ఉండగా, 380 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. గ్రామాల వారిగా పాస్ బుక్ లను విభజించాలన్నారు. ఆర్ఐ, ఏఇఓ లు క్షేత్ర తనిఖీలు చేసి, వ్యవసాయ యోగ్యం, వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు చేయాలన్నారు. నివేదికలకు ఒక ఫార్మాట్ రూపొందించి, క్షేత్ర అధికారులకు అందజేయాలన్నారు. నేటి నుండి సర్వే ప్రారంభించి, ఈ నెల 18 లోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 20 నుండి గ్రామ సభల నిర్వహణకు కార్యాచరణ చేయాలన్నారు. గ్రామ సభల్లో గ్రామ కార్యదర్శి తోపాటు, సంబంధిత శాఖ అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. గ్రామ సభ నిర్వహణకు విధి విధానాలు ఖచ్చితంగా పాటించాలని, వీడియోగ్రఫీ చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారులు రీ వెరిఫై చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి సంవత్సరానికి 12 వేలు, రెండు విడతలుగా లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఉపాధిహామీ జాబ్ కార్డు ఉండి, భూమిలేక, గత సంవత్సరం కనీసం 20 రోజులు ఉపాధిహామీ పనులు చేసిన వారికి ఆత్మీయ భరోసా పథకానికి అర్హులన్నారు. లబ్ధిదారులకు జాబ్ కార్డ్ లో భూమి వుండకూడదన్నారు. పథక సర్వే ఈ నెల 18లోగా పూర్తిచేసి, 20న చేపట్టే గ్రామ సభల్లో ప్రజల ముందు ఉంచాలన్నారు. క్రొత్త రేషన్ కార్డుల జారీకి మండల స్థాయిలో ఎంపిడివో లు, మునిసిపల్ కమీషనర్ లు, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి ధృవీకరణ బాధ్యత ఉంటుందన్నారు. ప్రభుత్వం నుండి జారీచేసిన ఫార్మాట్ లో సర్వే నివేదిక సమర్పించాలన్నారు. ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే జిల్లా వ్యాప్తంగా ముగింపు దశకు చేరిందన్నారు. సర్వే సమయంలో ఒక గ్రామం/ప్రాంతంలో ఉన్న కాని, లబ్ధిదారునికి భూమి ఏ గ్రామం/ప్రాంతంలో ఉంటే, ఆయా గ్రామ/ప్రాంతాల్లో మంజూరులు ఇవ్వాలన్నారు. ప్రతి దశలో ప్రభుత్వ మార్గదర్శకాలు తూ. చ. తప్పకుండా పాటించాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా తనిఖీలు పకడ్బందీగా చేయాలన్నారు. మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని, జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమీక్ష లో డిఆర్డీవో సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, డిసిఎస్ఓ చందన్ కుమార్, డీఏఓ పుల్లయ్య, పిడి హౌజింగ్ బి. శ్రీనివాస్, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, డీఎల్పిఓ రాంబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి మార్కెట్లో భారీ అగ్ని ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

అధికారుల విచారణలో పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. తన నియోజకవర్గంలోని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం రాత్రి జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులకు చెందిన పత్తి బస్తాలు షార్ట్ సర్క్యూట్‌తో ధగ్ధం కాగా... సంఘటన విషయం తెలిసిన మంత్రి అధికార యంత్రాంగాన్ని సంఘటన స్థలానికి చేరుకోవాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో మాట్లాడటంతో ఇతర అధికార యంత్రాంగాన్ని సైతం అప్రమత్తం చేశారు. మార్కెటింగ్, ఫైర్, పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి వెళ్ళిన పూర్తి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయంపై నూతనంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎన్నికైన యరగర్ల హన్మంతరావు, వైస్‌ఛైర్మన్ తల్లాడ రమేష్‌లను సైతం మార్కెట్‌ను సందర్శించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్‌లో జరిగిన సంఘటన ఏ విధంగా జరిగింది.. ఏ సమయంలో జరిగింది.. ఇందుకు గల కారణాలను సైతం క్షుణ్ణంగా తెలుసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. సెలవు రోజుల్లో ఈ సంఘటన జరగటంపై సమగ్ర వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలని అధికార యంత్రాంగాన్ని మంత్రి తుమ్మల ఆదేశించారు.

## న్యాయస్థానంపై నమ్మకం ఉంది

మొదటి పేజీ తరువాయి

సుప్రీమ్ కోర్ట్ నిర్ణయంపై బుధవారం అయన స్పందిస్తూ తెలంగాణ హై కోర్టులో తనపై దాఖలైన ఎన్నికల అఫిడవిట్ పిటిషన్ను రద్దు చేయాలని స్పెషల్ లీవ్ పిటిషన్ ద్వారా సుప్రీమ్ కోర్టును ఆశ్రయించడం జరిగిందని దీనిపై విచారించిన సుప్రీమ్ కోర్ట్ పిటిషన్ను రద్దు చేసి తెలంగాణ హై కోర్టులో తేల్చుకోవాలని సూచిందని, దీనిపై ఆందోళన చెందాల్సిన వసరం లేదన్నారు. ఎలాంటి ఆధారాలు లేని పిటిషన్ నిలువబోదని, కొందరి ప్రోద్భలంతోనే ఆధారాలు లేని పిటిషన్ తన అఫిడవిటీపై ధాఖలైందన్నారు. తన ఐదేళ్ల పదవికి ఎలాంటి ఢోకా ఉండవద్దని, నియోజకవర్గ ప్రజలు ఆందోళనకు గురికావద్దని, నియోజకవర్గ అభివృద్ధి ఎప్పటిలాగే కొనసాగుతుందని, తన సేవలు కొనసాగుతాయని కూనంనేని స్పష్టం చేశారు.

## డయాలసిస్ యూనిట్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన ఔట్ పేషెంట్ వార్డులో ఎక్స్రే యంత్రం పనిచేయకపోవటానికి గమనించి దీనిని ఎందుకు వాడటం లేదు అని సిబ్బందిని ప్రశ్నించారు, అది పాడైందని సిబ్బంది చెప్పగా కొత్త ఎక్స్రే యంత్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో ఎంతమంది డ్యూటీ డాక్టర్లు మరియు సిబ్బంది అందుబాటులో ఉన్నారు అని తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో చేపడుతున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ పనులు వారం రోజులలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ పనులను త్వరితగతిని పూర్తి చేసి డయాలసిస్ యూనిట్లు ప్రజల



అవసరానికి ఉపయోగపడేలా త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా క్యాజువాలిటీ వార్డును మరొక చోటికి షిఫ్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు. సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు.ఈ పరిశీలనలో ఆసుపత్రి సిబ్బంది ఆర్ అండ్ బి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
గురువారం 16, జనవరి 2025

# ట్రాక్టర్ పోటీలు డ్రైవర్ల సామర్థ్యాన్ని పెంచుతాయి : ఎమ్మెల్యే పాయం

**సరికొత్త ఆలోచనలతో పోటీలను నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు**

**గెలుపొందిన డ్రైవర్లకు బహుమతులు అందించిన ఎమ్మెల్యే**






**బూర్గంపాడు, సూర్య (మేజర్ న్యూస్)-** ట్రాక్టర్ నడిపే డ్రైవర్ల సామర్థ్యాన్ని, వారి నైపుణ్యతను వెలికి తీసేందుకు ఈ ట్రాక్టర్ పోటీలు దోహదపడతాయని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సంక్రాంతి పండగ వచ్చిందంటే ఎక్కువ శాతం మండలానికి అనుకున్న పక్క రాష్ట్రం ఏలేరు గ్రామంలో కోడిపందాలకు పరుగులు పెడతారు. సంక్రాంతి పండగ రోజు మంచి పోటీలను మన గ్రామంలోనే నిర్వహించి గెలుపొందిన వారికి తగిన బహుమతులు అందించాలని సంకల్పంతో మోరంపల్లి బంజర గ్రామంలో కొంతమంది రైతులు కలిసి పెద్దల సహకారంతో ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలను తలపెట్టడం జరిగింది. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంజరు గ్రామం వేదికగా ఇలాంటి ట్రాక్టర్ డ్రైవింగ్ పోటీలు జరపటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రాలో నిర్వహించే పోటీలను తెలంగాణ రాష్ట్రం తన సొంత నియోజకవర్గంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. నిర్వాకులు పోటీలలో డ్రైవర్లకు పెట్టినటువంటి నిబంధనలకు అనుగుణంగా సుమారు 50 మంది డ్రైవర్లు పాల్గొన్నారు. సుమారు 320 అడుగులు 8 అడుగుల వెడల్పు గీతల మధ్య ఎలాంటి గీతను తాకకుండా ట్రాక్టర్ ట్రాలీని రివర్స్లో రెండు నిమిషాల కాల వ్యవధిలోని సుమారు 11మంది డ్రైవర్లు చేరటం జరిగింది. అందులో 52 సెకండ్లలో మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన జింకల సుందరరామిరెడ్డి చేరుకొని మొదటి బహుమతిని గెలుసుకున్నారు. బుడ్డగూడెం గ్రామానికి చెందిన బొర్రా శ్రావణ్ కుమార్ 56 సెకండ్లలో చేరుకొని రెండవ బహుమతిని పొందారు. ఒక నిమిషం ఐదు సెకండ్లలో మర్రికుంట గ్రామానికి చెందిన మడకం రాజు చేరుకొని మూడవ బహుమతిని గెలుపొందారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి వారికి రూ 10016 లను ధనసరి శ్రీను, నలిని దంపతులు ప్రకటించగా, ద్వితీయ బహుమతి రూ 5016 లను బత్తుల రామకొండ రెడ్డి, బెజ్జం వెంకట్రామిరెడ్డిలు ప్రకటించారు. తృతీయ బహుమతి రూ 3016 లను సోము ఆదిరెడ్డి ప్రకటించారు. గెలుపొందిన డ్రైవర్లకు నిర్వాహకులు అందించిన సీల్డ్ కప్పులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందించారు. పోటీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ, ఇలాంటి పోటీలలో సామర్థ్యాన్ని నిరూపించుకుందేందుకు పోటీ పడాలని ఓడిని వారు తిరిగి గెలిచినందుకు ప్రయత్నాలు చేయాలని అన్నారు. ఇలాంటి చక్కటి మంచి ఆలోచనతో బంజర వేదికగా నిర్వహించిన నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. మంచి ఆలోచనలతో ముందు అడుగు వేసిన సోము ఆదిరెడ్డిని ప్రత్యేక అభినందనలు తెలిపారు. రానున్న రోజులలో మొరంపల్లి బంజర గ్రామంలో నిర్వహించినటువంటి ఈ పోటీలు పలు గ్రామాలలో విస్తరించేలాగా జరగాలని ఆకాంక్షించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రకటించిన వారిని ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేష్ రెడ్డి , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్లు పోతిరెడ్డి వెంకటేష్ రెడ్డి, కైపు లక్ష్మీనారాయణ రెడ్డి, భూక్యా ఆనంద్, గ్రామ పెద్దలు సా రెడ్డి దామోదర్ రెడ్డి, రెండ పుల్లారెడ్డి, జింకల కృష్ణారెడ్డి, కైపు ఎగిరెడ్డి, నగులూరి వీరారెడ్డి, నిర్వాహకులు మూల వెంకటరామిరెడ్డి, బత్తుల రామ కొండారెడ్డి ,యారం నాగిరెడ్డి, బిజ్జ వెంకటరామిరెడ్డి, మూల నాగిరెడ్డి,గాది నర్సిరెడ్డి,రాజశేఖర్ రెడ్డి, కామిరెడ్డి వెంకటరెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, బొబ్బల వెంకటరామిరెడ్డి, మేడం సంజీవరెడ్డి, డాక్టర్ డ్రైవర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# క్వార్టర్ ఫైనల్‌కి చేరిన యూసుఫ్ కప్



**బూర్గంపాడు సూర్య (మేజర్ న్యూస్) -** మండల కేంద్రంలో గత 17 సంవత్సరాలుగా మిత్రుని జ్ఞాపకార్థంగా నిర్వహిస్తున్నటువంటి యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచలు క్వార్టర్ ఫైనల్ చేరాయి. గురువారం 4 క్వాటర్ ఫైనల్స్ మ్యాచులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు .బుధవారం మొదటి ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచులో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఫరీద్ 11 కొత్తగూడెం జట్టు 10 ఓవర్లకు గాను 7 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది.113 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన ఆర్కే లెవెన్ మణుగూరు జట్టు 10 ఓవర్ లలో 60 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. బ్యాటింగ్ లో 18 పరుగులు చేసి బౌలింగ్ లో 2 వికెట్లు తీసిన ఫరీద్ ఎలేవన్ కొత్తగూడెం ఆటగాడు వంశీ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గెలుచుకున్నారు. రెండవ ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్లో మొదట బ్యాటింగ్ చేసినటువంటి హరి డ్రై హాట్ కోర్ ఫ్యాన్స్ పాల్వంచ జట్టు నిర్ణీత 10 ఓవర్లకు గాను 7 వికెట్ల నష్టానికి 61 భారీ పరుగులు చేసింది. 62 పరుగుల విజయ లక్ష్యం తో బ్యాటింగ్ చేసిన న్యూ స్టార్ అశ్వరావుపేట జట్టు చేజింగ్‌లో 6.3 ఓవర్లలో 63 పరుగులు చేసి విజయం సాధించింది. బౌలింగ్ లో 2 కీలకమైన వికెట్లు తీసిన అశ్వరావుపేట ప్లేయర్ సుబ్బు మ్యాచ్ అవార్డు గెలుచుకున్నారు.మూడవ ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్ చేసిన పందు స్ట్రైకర్స్ కొత్తగూడెం జట్టు నిర్ణీత ఓవర్ గాను ఐదు వికెట్లు నష్టపోయి 91 పరుగులు చేసింది. 92 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన బ్లూ క్యాప్స్ భద్రాచలం జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు నష్ట పోయి 72 పరుగులు చేసి ఓటమి చెందింది. బ్యాటింగ్లో పది పరుగులు చేసి నాటౌట్ గా నిలిచి బౌలింగ్లో మూడు వికెట్లు తీసిన పందు స్ట్రైకర్స్ ప్లేయర్ నజీర్ మ్యాన్ అఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నారు. నాల్గవ ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్లో టాస్ ఓడిపోయి బ్యాటింగ్ చేసిన చేజింగ్ లెవెల్ పాల్వంచ జట్టు నిర్ణీత 10 ఓవర్లకుగాను 7 వికెట్లు నష్టపోయి 75 పరుగులు చేసింది. 76 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన జగన్నాథపురం 9.5 ఓవర్లలో 48 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యి ఓటమి చెందింది. రెండు ఓవర్లు వేసి మూడు వికెట్లు తీసిన అంతర్జామీ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గెలుచుకున్నారు.

# జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ నెంబర్‌ని కలిసిన గిరిజన సంక్షేమ సంఘం ఉద్యోగులు



**టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్)-** జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ ను మర్యాదపూర్వకంగా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాంకుడోత్ హతిరామ్ నాయక్ కలిసి సంక్రాంతి కనుమ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించినట్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఉద్యోగుల కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు, గిరిజనులకు కోడ్ పట్టాల, అసైన్మెంట్ సీలింగ్ పట్టాల సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీలకు జరిగే అన్యాయం, సమస్యల ను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట బిజెపి మండల అధ్యక్షులు తేజావత్తు శంభు నాయక్, ధరావత్ బాలాజీ నాయక్, గిరిజన సంఘం నాయకులు లింబియా నాయక్, లాలు నాయక్, హర్యా నాయక్, బాల తదితరులు ఉన్నారు.

# నూజివీడు కోడిపందాలలో పాల్గొన్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం దంపతులు





**ఇల్లందు సూర్య (మేజర్ న్యూస్)-** అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆంధ్ర రాష్ట్రంలోని నూజివీడు లో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న కోడిపందాలలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఆయన సతీమణి కోరం లక్ష్మిలు పాల్గొన్నారు. అదేవిధంగా అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయ బాబు దంపతులు కూడా పాల్గొన్నారు. కోరం కనకయ్య వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, వసంత్ లు ఉన్నారు.

# మల్లమ్మ మృతదేహానికి నివాళులర్పించిన తుళ్లూరి బ్రహ్మయ్య



**అశ్వాపురం, సూర్య (మేజర్‌న్యూస్)-** మండలపరిధిలోని ఆనందపురం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బెల్లి చిన్న మల్లమ్మ మృతదేహానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్తినేని వాసు, మాజీ ఎంపీపీ వూస అనిల్ కుమార్ , జానపాటి నాగయ్య, కురం నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ముగిసిన స్వామి వివేకానంద అవుట్ డోర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్




**భద్రాచలం, సూర్య( మేజర్ న్యూస్)-** భద్రాచలంలో జరిగిన స్వామి వివేకానంద అవుట్ డోర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజయంతంగా ముగిసింది. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నువ్వా నేనా అంటూ ఉత్కంఠ భరితంగా సాగింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా కుంజా ధర్మా,శ్రీ పాకాల దుర్గాప్రసాద్ఇన్-స్పెక్టర్ వజ్జా రవి, ఎస్కే అజీమ్, బాలయోగి, పాల్గొన్నారు.ఈ పోటీలలో మొదటి బహుమతి భద్రాచలంకు చెందిన సాయి, సర్వేశ్,రెండవ బహుమతి కొత్తగూడెంకు చెందిన నాగేశ్వర్ రావు అఖిల్,మూడవ బహుమతి భద్రాచలం కు చెందిన సంతోష్ అర్షద్,నాల్గవ బహుమతి భద్రాచలం కు చెందిన కుంజా సంతోష్ఆనంద్ గెలుపొందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యాడ్మింటన్ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 64 టీమ్స్ ఈ పోటీలలో పాల్గొన్నారు. కొత్తగూడెం, మణుగూరు, లక్ష్మీపురం, కూనవరం ,భద్రాచలం నియోజకవర్గం ప్రాంతాలనుండి టోర్నీలో క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు ముఖ్య అతిధులు బహుమతి ప్రదానం చేసారు.

# మండల వ్యాప్తంగా ఘనంగా మకర సంక్రాంతి కనుమ వేడుకలు

## పిల్లాపాపలతో సందడిగా మారిన గ్రామాలు





**చంద్రుగొండ, సూర్య (మేజర్ న్యూస్)-** ఎన్ని పండుగలు ఉన్నా.... సంక్రాంతి పండుగ ప్రత్యేకమైనది. సంక్రాంతి అంటేనే సందడి అనేంతగా తెలుగునాట సంక్రాంతి సంబరాలు ప్రసిద్ధి పొందాయి. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడంతో ఉత్తరాయనం మొదలవుతుంది. ఉత్తరాయనాన్ని పుణ్యకాలంగా భావిస్తారు. అందువల్ల మకర సంక్రాంతిని తెలుగునాట ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగను పునస్కరించుకొని ఊరూరా ముంగిట్లో రంగవల్లుల ముగ్గులు, వేసి గొబ్బెమ్మలను, తీర్చిదిద్దారు. సంక్రాంతి సందర్భంగా గంగిరెద్దుల గంటల సవ్వడులు, బుడబుక్కల వాయిద్యాల ధ్వనులు, హరిదాసుల హరినామ కీర్తనలు గ్రామస్తులను కనువిందు చేశాయి. చిన్న పెద్ద అనే తేడా లేకుండా నింగిని తాకే విధంగా రంగురంగుల పతంగులను ఎగురవేసి కనువిందు చేసారు. కొన్నిచోట్ల ఆడపడుచులు సంక్రాంతి సందర్భంగా ఇళ్లల్లో బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి లక్ష్మీదేవి పూజలు చేశారు. చిన్నారులకు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కొత్త వస్త్రాలు ధరింపజేసి తెలుగు సంప్రదాయాలు అర్థం అయ్యేలా చేశారు. ఇగ కనుమను పునస్కరించుకొని రైతులకు వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉండే గోవులను, ఉదయాన్నే స్థానం చేయించి. పసుపు, కుంకుమలు, అద్ది ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పశువుల కోసం వండిన ప్రత్యేక వంటకాలను పశువులకు ఆహారంగా అందజేశారు.

# పండగ రోజు పూసుకుంట గిరిజనులతో గడిపిన మంత్రి తుమ్మల మనవడు ప్రయాగ్





**దమ్మపేట, సూర్య (మేజర్ న్యూస్ )–** ప్రజా శ్రేయస్సు కోసం ... ప్రజల సంక్షేమం కోసం నిత్యం తపించే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మనవడు ప్రయాగ్ చిన్ననాటి నుండి ప్రజలకు సేవ చేసే దిశలో బుడిబుడి అడుగులు వేస్తూ తాతకు తగ్గ మనవడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ క్రమంలోనే ఆరు నెలల క్రితం మండల పరిధిలోని మారుమూల గొత్తికాయల గిరిజన ప్రాంతం అయినటువంటి పూసుకుంట,కట్కూరు, గ్రామాలను సందర్శించి గ్రామంలో ఉన్న గిరిజనులను ఆయన తాత తుమ్మల నాగేశ్వరరావులా.. ప్రతి ఒక్కరిని పలకరిస్తూ వారి యోగక్షేమాలను తెలుసుకుంటూ ముందుకు సాగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను తాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెవిన వేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరిన విషయం తెలిసిందే. ఈ దిశలోనే ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూసుకుంట, కటుకూరు గ్రామాలను సందర్శించి అధికారులను ఒకే తాటిపైకి తీసుకొచ్చి పూసుకుంట రోడ్డు ఏర్పాటు, గిరిజన రైతులకు బోర్లు, వ్యవసాయ భూములలో పామాయిల్ పంట సాగు, రైతులకు ఉచిత డ్రిప్ సౌకర్యం, పామాయిల్ పంట సాగు చేసే రైతులకు బ్యాంకు రుణాలు, పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి పూసుకుంట కటుకూరు గ్రామాల గిరిజనుల కలను సాకారం చేశారు. ఆయన బాటలోనే ఆయన మనవడు ప్రయాగ్ సంక్రాంతి పండుగను పూసుకుంట కటుకూరు గిరిజనులతో గడపాలని చిన్న ఉద్దేశంతో నిండు హృదయంతో గిరిజనుల మధ్య గడిపి వారి అభిమానాన్ని పొందారు. గిరిజనుల చిన్నారులతో ఆడి పాడారు..చిన్నారులకు మిఠాయిలు పంచి వారితో ఆనందంగా గడిపారు. ప్రయాగ్ తాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అడుగుజాడల్లో నడుస్తూ గిరిజన ప్రజల శ్రేయస్సుకోసం అడుగులు వేస్తున్న ప్రయాగ్ ను గ్రామ ప్రజలు అభిమానంతో శాలువాతో సత్కరించి గిరిజనుల నిండు హృదయాలతో ఆయనను ఆశీర్వదించారు. పండుగ రోజు కుటుంబ సభ్యులతో గడపకుండా గిరిజన కుటుంబాలతో పండుగను పంచుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరావు మనవడు ప్రయాగ్ ను పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మాజీ ఏఎంసి వైస్ చైర్మన్, రాజకీయ సీనియర్ నాయకులు కొయ్యల అచ్యుతరావు,కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు కాసాని నాగ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

# ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం ప్రభుత్వం

## సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ




**టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్ )–** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు విమర్శించారు. రైతు రుణమాఫీ చేయడంలో అనేక కొర్రీలు పెడుతుందని, రైతు భరోసా రూ 15 వేలను ప్రకటించిన రూ 12 వేలను ఇస్తామని కాలాన్ని సాగదీస్తూ, ఒక విడత ఎగనామం పెట్టిందని, మహిళలకు రూ 2500 లు ఇస్తామని వితంతువులు, వృద్ధులకు రూ 4వేలు పింఛను ఇస్తామని, వికలాంగులకు రూ 6 వేలలను ఇస్తామని ఎన్నికల హామీలను ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత, ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయకుండా కాలయాపన చేస్తు ప్రజలను మోసపూరితంగా మభ్యపెడుతున్నారన్నారు. టేకులపల్లిలో బుధవారం భూక్య హర్జ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటుతు న్నప్పటికిని హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని అన్నారు. ఆరు గ్యారెంటీల అమలకై సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధరావత్ వెంకన్న,ఎట్టి నరసింహారావు,గుగులోతు రామచందర్,మేకల వినోద్, పూనెం సమ్మయ్య, బానోతు వెంకట్రాం, పులసం రుక్కమ్మ, కోడం రవి, ఐఎఫ్ టియు నాయకుల డి .ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వ్యక్తి కాదు ఒక శక్తి




ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్) :** మండలంలోని కాకర్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణకు వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాసు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులతో కలిసి రిబ్బన్ కత్తిరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ ఎన్టీఆర్ వ్యక్తి కాదని, ఒక శక్తి అని దేశ రాజకీయాలను అయన శాసించారని పేర్కొన్నారు.తెలుగు జాతి గౌరవాన్ని దశదిశల వ్యాప్తి చెందేలా ఎన్టీఆర్ కృషి చేశారని, అన్ని వర్గాల ప్రజలకు రాజకీయ నాయకత్వం అందించిన మహనీయుడని తెలిపారు. రాజకీయ పార్టీలకు ఒడిదుడుకులు,గెలుపు ఓటములు సహజమని అన్నారు. తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన సమయంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వైరా నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే 3, 4వ స్థానాల్లో నిలిపామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గుర్తుపై గెలిచిన ఏన్కూర్ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి విజయంలో క్రియాశీలకంగా వ్యవహరించామన్నారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి అందరితో స్నేహపూరితంగా వ్యవహరిస్తున్నానని, తనకు రాజకీయంగా ఎదిగేందుకు సహకరించిన తెలుగుదేశం పార్టీ నాయకులకు అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. టిడిపి పార్టీ సహకారంతోనే తాను ఎమ్మెల్యేగా గెలిచానని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి, వాసిరెడ్డి రామనాథం,కూరపాటి వెంకటేశ్వర్లు, ఆరెం రామయ్య,కాపా కృష్ణ మోహన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్,మాజీ ఎంపీటీసీ దుద్దుకురి మధుసూదన్ రావు, భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ ఓబిసి సెల్ అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు,లేళ్ల గోపాలరెడ్డి, ధరావత్ రాంబాబు పాల్గొన్నారు.

# గురుకుల ప్రవేశాల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన పిన్నపాక ఎమ్మెల్యే పాయం



**పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)–** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బిసి, ఎస్సి, ఎస్టీ, జనరల్ గురుకుల పాఠశాలలో ప్రవేశాలను కోరుతూ గురుకుల సొసైటీ రూపొందించిన వాల్ పోస్టర్ ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కీసర నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని తెలియజేశారు. ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం కాస్మోటిక్, మిస్ చార్జీలను పెంచిన విషయం తెలియజేశారు. గురుకులాలను బలోపేతం చేయడానికి గాను తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తూ మెరుగైన విద్య, సౌకర్యాలను కల్పించడంలో ముందంజలో ఉంది అని పేర్కొన్నారు. కావున విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకొనగలరని కోరారు. ప్రిన్సిపాల్ కీసర నాగేశ్వరరావు మాట్లాడుతూ గురుకులాల్లో ప్రవేశానిక ఐదో తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి జనన,కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో లతో అందుబాటులో ఉన్న మీసేవ లేదా గురుకుల పాఠశాల లను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే హాల్ టికెట్ పొందే అవకాశ కల్పించిన విషయం తెలియజేశారు. కావున విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకొని గురుకుల పాఠశాలలో ప్రవేశాలు పొందాలని కోరారు.

# నేడు కల్లు మెమోరియల్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్

## ఫైనల్ చేరిన టేకులపల్లి టైగర్స్, న్యూ స్టార్ 11 టీమ్స్



**టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్)–** మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కల్లు మెమోరియల్ కప్ 2025 కొత్తతండా పంచాయతీ లోని న్యూ స్టార్ 11యూత్ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్లో బుధవారం సెమీ ఫైనల్లో మ్యాచ్ వెంకట్యతండా, టేకులపల్లి టైగర్స జట్లు మధ్య జరిగిన మ్యాచ్ నువ్వ నేనా అన్నట్టుగా జరిగిన మ్యాచ్లో టేకులపల్లి టైగర్స్ విజేతలుగా నిలిచారు. ఈ మ్యాచ్లో బౌలింగ్ లోను, బ్యాటింగ్ లోను ఉత్తమమైన ప్రతిభ కనబరిచిన టైసన్‌కు పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందజేశారు. గురువారం జరిగేటువంటి ఫైనల్ లో టేకులపల్లి టైగర్స్, న్యూ స్టార్ 11 టీమ్లా మధ్య ఫైనల్ మ్యాచ్ తో ఈ టోర్నమెంట్ ముగుస్తుంది. ఈ మ్యాచ్లో విజేతలకు మొదటి బహుమతి రూ 25వేలు , రన్నర్ కు రెండవ బహుమతి రూ 15వేలు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ , టేకులపల్లి ఎస్సై పోగుల సురేష్ చేతుల మీదుగా ఇవ్వడం జరుగుతుందని కళ్ళు మెమోరియల్ మేనేజ్మెంట్ కుమార్, వెంకటేష్, హనుమంతు, వంశీ, రాజా తెలిపారు.

# బిజెపి చర్ల మండల అధ్యక్షుడిగా నూప రమేష్



**చర్ల, సూర్య (మేజర్ న్యూస్)–** చర్ల మండలం సి కొత్తూరు గ్రామానికి చెందిన నూప రమేష్ ను భారతీయ జనతాపార్టీ చర్ల మండల అధ్యక్షుడిగా నియమిస్తూ బిజెపి రాష్ట్ర కమిటీ ప్రకటన విడుదల చేసింది. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తూ బిజెపి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీని బలోపేతం చేస్తున్నందుకు ఆయనకు మండల అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూప రమేష్ మాట్లాడుతూ తనను గుర్తించి మండలాధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.మండలంలో బిజెపి ని మరింత బలోపేతం చేసేందుకు తాను కృషి చేస్తానని, పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకూ తీసుకెళ్ళి కార్యకర్తలతో మమేకమవుతానని అన్నారు.మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అత్యంత వైభవోపేతంగా గోదాదేవి కల్యాణం



**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్) –** మండల కేంద్రంలోని ప్రముఖ వైష్ణవాలయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మకర సంక్రాంతి పురస్కరించుకొని శ్రీ గోదాదేవి శ్రీ రంగనాథుల స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఆలయ మేనేజర్ పాకల వెంకటరమణ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రతాపురం ప్రసాదాచార్యులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు లతో కళ్యాణాన్ని నిర్వహించి, కళ్యాణ ప్రాముఖ్యతను వివరించారు. కళ్యాణం తిలకించేందుకు చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుండి భారీగా భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తరించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కల్యాణ అనంతరం భక్తులు ఆలయ సిబ్బంది అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# సంపసాల అశోక్ జ్ఞాపకార్థం గ్రామస్తులకు చేతిపంపు బహుకరణ

**–అశోక్ పుట్టినరోజు సందర్భంగా చేతిపంపును ప్రారంభించిన కుటుంబ సభ్యులు.**

**–తన వంతుగా ఎంతోకొంత ప్రజలకు సహాయపడాలనే కోరిక .. సంపసాల వెంకట కృష్ణ**

**కల్లూరు జనవరి16(సూర్య న్యూస్):**

ఖమ్మం జిల్లా, కల్లూరు మండలం, చెన్నూరు గ్రామానికి చెందిన సంపసాల అశోక్ జ్ఞాపకార్థం, చంపసాల అశోక్ మెమోరియల్ ఆధ్వర్యంలో సంపసాల అశోక్ కుటుంబ సభ్యులు కాంగ్రెస్ యువ నాయకులు సంపసాల వెంకటకృష్ణ 50 వేల రూపాయలతో చేతిపంపును చెన్నూరు గ్రామ ప్రజల కోరిక మేరకు చెన్నూరు లోని దయతమ్మ తల్లి దేవాలయం ఆవరణలో అందుబాటులోకి తెచ్చారు. సంపసాల అశోక్ పుట్టినరోజు సందర్భంగా చేతిపంపును ప్రారంభించారు. నిత్యం రద్దీగా ఉండే దళితమ్మ తల్లి దేవాలయం దగ్గర నీటి వసతులు లేవనే విషయాన్ని సంపసాల ముత్తారావు – యువ నాయకులు సంపసాల వెంకటకృష్ణ దృష్టికి స్థానిక ప్రజలు తీసుకురాగా సంపసాల అశోక్ మెమోరియల్ ఆధ్వర్యంలో సుమారు 50 వేల రూపాయలు వెచ్చించి చేతి పంపను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. సంపసాల అశోక్ మెమోరియల్ ఆధ్వర్యంలో గతంలో చాలా కార్యక్రమాలు నిర్వహించారు తల సేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరాలను నిర్వహించి ఎంతోమంది తల సేమియా వ్యాధితో బాధపడుతున్నటువంటి వ్యాధిగ్రస్తులకు రక్తాన్ని అందిస్తూ వారికి ఆసరాగా నిలుస్తున్నారు. చెన్నూరు గ్రామ ప్రజల కోరిక మేరకు దళితమ్మ తల్లి దేవాలయం సమీపంలో చేతి పంపను నిర్మించడం



ద్వారా స్థానిక ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు. దయతమ్మ తల్లి దేవాలయం ప్రాంగణం ఆనుకొని కొన్ని వందల ఎకరాల పంట సాగు చేస్తారు, వారికి త్రాగు నీటి అవసరం ఎంతైనా ఉంటుంది అని గమనించిన సంపసాల కుటుంబం స్థానికులకు అండగా నిలిచింది. చెన్నూరు స్థానిక ప్రజలు చంపసాల అశోక్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్మించిన చేతి పంపు నిర్మాణాన్ని హర్షిస్తూ ఆనందాన్ని వ్యక్తపరిచి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## గుర్తు తెలియని మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహించిన అన్నం సేవా ఫౌండేషన్



**ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):**

గత నాలుగు రోజుల క్రితం ఖమ్మం జిఆర్పి పోలీస్ పరిధిలోని బోనకల్లు నాగులవంచ రైలు స్టేషన్ల మధ్యన గుర్తు తెలియని 45 సంవత్సరాల మగ మృతదేహం లభ్యం కాగా అట్టి మృతదేహాన్ని ఖమ్మం జి ఆర్ పి పోలీసులు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి భద్రపపర్చారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు .మృతదేహం కొరకు ఎవరూ రానందున మృతదేహాన్ని దహన సంస్కార నిమిత్తం అన్నం ఫౌండేషన్ కి ఖమ్మం జిఆర్పి పోలీస్ వారి సమాచారం మేరకు అన్నం ఫౌండేషన్ ఖమ్మం జి అర్ పి ఎస్ ఐ పారుపల్లి భాస్కర రావు , వైద్యశాల సిబ్బంది సమక్షంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని తెల్ల వస్త్రంతో చుట్టి పూలదండలతో అలంకరించి ఖమ్మం నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామానికి తరలించి అన్నం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అన్నం శ్రీనివాసరావు ఆద్వర్యంలో దహన సంస్కారం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నం పౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## స్వాతంత్ర్య సమరయోధుడు భూక్యరాములుకు నివాళి

**ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):**



స్వాతంత్ర్య సమరయోధుడు భూక్యా రాములు వర్ధంతిని పుర స్కరించుకొని ఆయన సమాధి వద్ద ఆయన కుటు ంబ సభ్యులు ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకర వాయి గ్రామానికి చెందిన భూక్యా రాములు నిజాం వ్యతిరేక పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న సమరయోధుడు. వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి తండ్రి దివంగత స్వతంత్ర సమరయోధుడు రాములు కాగా రాములు కుమారుడు , సిపిఐ గ్రామ అధ్యక్షుడు భూక్యా శ్రీను , కుటుంబ సభ్యులు అంజమ్మ ,వినీల ,వినోద్ ,హుస్సేన్, కృష్ణ లు భూక్యా రాములు కు నివాలులు అర్పించారు.

## పండుగ రోజు పార్థసారథి పురంలో విషాదం

**- ఆగి ఉన్న బైక్ ని ఢీ కొట్టిన కారు.**

**- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు**









**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...**

సంక్రాంతి పండుగ రోజు పార్థసారథి పురంలో విషాదం నెలకొంది. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సంక్రాంతి పండుగ పూట వారి కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెనుబల్లి మండలం రంగారావు బంజర గ్రామంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రక్కన ఆగి ఉన్న బైక్ ని కారు అతి వేగంగా ఢీ కొట్టడంతో బైక్ సుమారు 50 మీటర్ల దూరంలో పడిపోయింది. బైక్ పై ఉన్న ఇద్దరు వ్యక్తులు 30 మీటర్ ల దూరంలో రోడ్డుపై ఎగిసి పడ్డారు. బైక్ పై ఉన్న కీసర రాజారావు(34) మృతి చెందగా మరో వ్యక్తి కుంజ మహేష్ తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురు సార్దసారథి పురం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. మరో బైక్ పై ప్రయాణిస్తున్న మృతుడి తమ్ముడు నరసింహారావు స్థానికుల సహాయంతో అంబులెన్స్ లో పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు అప్పటికే కీసర రాజారావు మృతి చెందినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన మహేష్ని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. పెనుబల్లి మండలం పార్థసారథి పురం గ్రామానికి చెందిన కీసర రాజారావు, కుంజ మహేష్ లు అనేవారు వియ్యం బంజర గ్రామంలో మంగళవారం సుతారు పనికి వెళ్లి తిరిగి స్వగ్రామం పార్థ సారథి పురంకి బైక్ పై వెళుతున్నారు. సుమారు రాత్రి 9:30 గంటల సమయంలో రంగారావు బంజర వద్దకు చేరుకోగానే మరుసటి రోజు కనుమ పండుగ సందర్భంగా ముత్యాలమ్మ కి పెట్టుకునేందుకు మేకపోతుని కొనేందుకు రంగారావు బంజర వద్ద జాతీయ రహదారి ప్రక్కన బైక్ ని నిలిపి చరవాణిలో మాట్లాడుతున్నారు. అదే సమయంలో వియ్యం బంజర్ నుండి కొత్తగూడెం వైపుకు వెళుతున్న కారు అతి వేగంగా బలంగా ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని కారు ఆపకుండా వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై మృతుని తమ్ముడు నరసింహారావు ఫిర్యాదు చేయడంతో ఎస్ ఐ కే. వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**వైరాసూర్యమేజర్ న్యూస్:–**



స్థానిక ఠాగూర్ విద్యాలయం లో 2013–14 సంవత్సరం లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వ హించారు. వివిధ ప్రాంతా లలో స్థిర పడిన విద్యార్థుల ందరు కలిసి తాము చదువుకున్న రోజులలో ని తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. కరస్పాన్డెంట్ సంక్రాంతి రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఉన్నత స్థాయి కి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంయోగిత ఆనాటి ఉపాధ్యాయులు రామకృష్ణ, మజీద్, రాంబాబు, మరియు పూర్వ విద్యార్థులు పవన్, హరిబాబు, రాకేష్, భార్గవ్, ఉమ, ఉమా సంధ్య, సరిత, ఉషారాణి , శ్రీలేఖ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతోనమ్మకు కడసారి కన్నీటి వీడ్కోలు

**– అంతోనమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజానీకం**

**– నివాళులు అర్పించిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు**

**కల్లూరు : సూర్యమేజర్ న్యూస్:**





మండల పరిధి తాళ్లూరు వెంకటాపురం గ్రామంలో వినుకొండ అంతోనమ్మ అంతి మ యాత్రలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై ఘనంగా నివాళు లర్పించారు. అందులో భాగంగా గ్రామం లో అంతిమ యాత్రలో అందరూ పాలొ ్గన్నారు. కడసారిగా అంతోనమ్మ అంతిమ యాత్ర కన్నీటి నడుమ కొనసాగింది ఈ కార్యక్రమంలో వివిధ రాజ కీయ పార్టీల నాయకులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా చింతలపూడి వెంకటేశ్వరరావు నీరజ "పుట్టినరోజు" వేడుకలు

**వైరాసూర్యమేజర్ న్యూస్:**





వైరా లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో మంగళవారం సాయిబాబా మందిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వర్ రావు గద్దె నీరజ జన్మదిన వేడుకలను సభ్యుల మధ్య కేక్ కట్ చేసి ఘనముగా నిర్వహించారు. అనం తరం వైరా లయన్స్ క్లబ్ మహిళా కో ఆర్డినేటర్ గద్దె నీరజ "జన్మదినము" పురస్కరించుకొని ఆమె సహకారంతో మిట్టపల్లి లక్ష్మీ అనే మహిళకు కుట్టు మిషన్ ను అందించారు మధ్యాహ్నం 12 గంటలకు వైరా మండలం గొల్లపూడి గ్రామంలో వృద్ధుల ఆశ్రమంలో కొణతాలపల్లి సుజిత్ మామగారైన కీర్తిశేషులు బొజ్జ మురలీకృష్ణ జయంతి సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబా మందిరంలో జరిగిన ఇరువురి పుట్టినరోజు వేడుకల కు లయన్స్ సభ్యులందరూ శు భాకాంక్షలు తెలియజేశారు అనంతరం గాట్ అంబాసిడర్ డాక్టర్ కాపా మురలీకృష్ణ మాట్లాడుతూ సభ్యులందరూ తమ తమ పుట్టినరోజులు పెళ్లి రోజులను సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించాలని తద్వారా మానసిక సంతృప్తి కలుగుతుందని ఆయన తెలిపారు సంపాదనలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేందర్ రావ్ సెక్రటరీ అబ్బూరి రమేష్ ఐదో వార్డ్ కౌన్సిలర్ మాదినేని సునీత కే సరిత పి శ్రావణి పి జిజేష విష్ణువర్ధన్ రావు కొల్లా రాంబాబు మరియు కొణతాలపల్లి సుజిత్ మౌనిక సజిత మీల్స్ అండ్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పులి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

## -పాల్గొన్న ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్: పువ్వాళ్ళ దుర్గాప్రసాద్
## -మంత్రోచ్ఛారణ తో ఘన స్వాగతం పలికిన అర్చకులు, ఆలయ కమిటీ వారు

**వైరాసూర్యమేజర్ న్యూస్ః-**

గొల్లపూడి గ్రామంలో ప్రసిద్ధి గాంచిన స్వయంభు శ్రీ పులి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నందు కనుమ రోజు కళ్యాణ మహోత్సవానికి హాజరైన ఆ లక్ష్మీ నరసింహులు లను దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడు తూశ్రీ లక్ష్మీనరసింహస్వామి కొలువుదీరిన గొల్లపూడి పులిగుట్ట నందు కనుమ సందర్భంగా కళ్యాణ మహోత్సవానికి గొల్లపూడి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలయ కమిటీ ఆహ్వానించడం ఆ నరసింహుని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడం చాలా ఆనందంగా ఉందని వారి ఆశీస్సులు మాపై రాష్టంపై రాష్ట్ర ప్రజలపై కృపాకటాక్షం ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి నియోజకవర్గ అభివృద్ధికి శక్తిని ప్రసాదించాలని స్ఫూర్తిగా కోరుకుంటున్నాను.ఈ కార్యక్రమంలో పొదిల హరినాథ్, షేక్ సైదా, సూరంపల్లి రామరావు,



వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పమ్మి అశోక్, పణితి శ్రీను, పల్లపు కొండలు, మేడూరి రామారావు, మిట్టపల్లి సతీష్, పెండ్యాల కోటేశ్వరరావు, గుడపాటి చిట్టి, శీలం నాగిరెడ్డి, వెంకటేశ్వరరావు, డ్వాక్రా మహిళలు, ఆలయ ఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# 16వ డివిజన్‌లో ముగ్గుల పోటీలు

## -బహుమతులు అందజేసిన కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు







**ఖమ్మం టౌన్, సూర్య న్యూస్:**

ఖమ్మం నగరం 16వ డివిజన్ అగ్రహారం కొత్త కాలనీలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ రోజైనా బుధవారం కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. కాలనీలోని సుమారు 300 మంది మహిళలు ముగ్గులు వేశారు. కార్యక్రమానికి మహిళల నుండి భారీ ఎత్తున స్పందన రావడంతో ఫస్ట్, సెకండ్ , థర్డ్ ప్రైజ్ ల తో పాటు 25 మందికి పట్టుచీరలు, పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. మొద టి బహుమతి అరుణ అందుకోగా రెండవ బహుమతి మహా, తృతీయ బహుమతి తేజు, ఓర్సు పవిత్రలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల వెంకటేశ్వర్లు, ఇరుకుల బోయిన సురేష్, వెంకటేశ్వర్లు, ఓలం శక్తి, రామారావు, ఆటో యూనియన్ నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి రాజుల దేవరపాడును ఆదర్శంగా తీసుకోవాలి- సుధాకర్ రెడ్డి



**ఎర్రుపాలెం, సూర్య మేజర్ న్యూస్ :-**

ప్రతి విద్యార్థి రాజుల దేవరపాడు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకో వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గ్రామ మాజీ సర్పంచి వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం సంక్రాంతి పండుగ సందర్భంగా రాజుల దేవరపాడు గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు.గెలుపొందిన వారితో పాటు పార్టిసిపేషన్ చేసిన ప్రతి ఒక్కరికి కన్సిలేషన్ బహుమతులును అందజేశారు. అనంతరం ఇటీవ ల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించిన పదిమంది కి గతంలో ప్రభుత్వ సంస్థల లో వివిధ రంగాల్లో ఉద్యోగాలు సాధించిన వారిని శాలవల తో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించిన వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నతమైన ఉద్యోగాలు సాధించాలని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని , బాధ్యత తో ఇష్టం వచ్చిన రంగాన్ని ఎంచుకొని కష్టపడి చదివి వి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలని రాజుల దేవరపాడు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండారు నరసింహారావు, మండల కిసాన్ అధ్యక్షుడు తల్లపురెడ్డి నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ తలపరెడ్డి ప్రవళిక, ప్రధానోపాధ్యాయులు మారపాక బాబురావు, రామాలయ కమిటీ చైర్మన్ సభ్యులు, మాజీ వార్డు సభ్యులు అయ్యప్ప రెడ్డి, సాంబయ్య, ఐలూరి చిన్న పుల్లారెడ్డి, దుద్దుకూరి తిరుపతిరావు, వెన్నపూస వెంకటనారాయణ రెడ్డి, వేమిరెడ్డి కోటిరెడ్డి, బండారు శ్రీనివాసరావు, పెద్ద పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు నాగమణి, శ్రీనివాసరావు, లింగయ్య, విశ్రాంతి ఉపాధ్యాయులు అంజయ్య గ్రామస్తులు, పాల్గొన్నారు.

# నిస్వార్థ నాయకుడు సంభాని:-ఏ.వి.చలపతి రెడ్డి

## -కుర్నవల్లిలో ఘనంగా సంభాని జన్మదిన వేడుకలు



**తల్లాడ సూర్య మేజర్ న్యూస్:-**

ఆర్థిక సంబంధాలతో కూడుకున్న నేటి రాజకీయ వ్యవస్థలో నిస్వార్థ,నిరాడంబర నాయకుడు సంభా ని చంద్రశేఖర్ మాత్రమే అని ఆయన అభిమాని అయిలూరి వెంకట చలపతి రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చలపతి రెడ్డి మాట్లాడుతూ 1983లో పాలేరు నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేసిన చంద్రశేఖర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా,పిసిసి వైస్ ప్రెసిడెంట్ గా కొనసాగాడని తెలియజేశాడు. ఉమ్మడి రాష్ట్రంలో వైద్యారోగ్య శాఖ మంత్రిగా కొనసాగిన ఆయన ఎప్పుడు హంగు,ఆర్భాటాలకు తావివ్వలేదని,ఆది నుంచి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పించాడని ఆయనకు గుర్తు చేశాడు.అనంతరం అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి,మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అయిలూరి రామశేసిరెడ్డి,సామ్రాట్ రెడ్డి,గుర్రాళ్ళ గోపాలకృష్ణ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంక్రాంతి సంబురం..

## -కత్తులు దూసిన కోళ్లు.. చేతులు మారిన వందల కోట్లు

**ఖమ్మం (సూర్య బ్యూరో):**

కోడిపందేలు, గుండాటలు, పేకాటల్లో ఎన్ని కోట్లు చేతులు మారతాయో లెక్కగట్టి చెప్పేందుకు ప్రత్యేకంగా మనుషులేం ఉండరు. కాకపోతే.. ఒక్కో బరిలో తీస్తున్న నోట్ల కట్టలు, పెడుతున్న పందేలను చూస్తే.. ఎన్ని కోట్లు చేతులు మారుతున్నాయో అంచనా వేయొచ్చు. ఈ రెండ్రోజుల్లోనే.. అంటే భోగి, సంక్రాంతికి కలిపి కనీసం వెయ్యి కోట్ల రూపాయల దాకా చేతులు మారి ఉంటాయని అంచనా వేస్తున్నారు. కోడిపందేలు భోగి, సంక్రాంతి, కనుమల్లోనే కాదు.. పండక్కి వారం ముందే మొదలవుతాయి. పండగ తరువాత కూడా నడుస్తుంటాయి. ఈ లెక్కన పోయిన ఏడాది ఏకంగా 3వేల కోట్లు రూపాయలు చేతులు మారినట్టు తెలుస్తోంది. ఈసారి సంక్రాంతి సీజన్‌లో 3వేల కోట్లు దాటుతుందని అంచనా.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో భోగి నాడే 175 కోట్ల రూపాయల పందేలు జరిగినట్టు చెబుతున్నారు. ఇక మొత్తం గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, రాయలసీమ జిల్లాల్లో జరిగే కోడిపందేలను కూడా లెక్కేస్తే.. ముక్కున వేలేసుకోవాల్సిందే. కృష్ణా జిల్లాలో అతిపెద్ద బరిగా ఉన్న అంపాపురంలో ఏకంగా 10 కోట్లకు పైన పందేలు జరిగినట్టు చెబుతున్నారు. పైగా ఈసారి ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ నాయకుల చేతుల మీదుగా కోడిపందేలు ప్రారంభమయ్యాయి. దీంతో.. చాలాచోట్ల పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరించారు. ఈసారి ఏపీ సరిహద్దున ఉన్న తెలంగాణ జిల్లాల్లోనూ జోరుగా కోడిపందేలు జరిగాయి. భోగికి ముందే తెలంగాణలోని ఆంధ్రా సరిహద్దుల్లో కోట్ల రూపాయలు చేతులు మారాయి.ఈసారి పందాల్లో ట్రెండ్ మార్చారు.. లక్షల విలువైన బహుమతులను సైతం ప్రకటించారు. కోడిపందేల్లో గెలిచిన వారికి మహీంద్రా థార్ కారు, బుల్లెట్ బండ్లు,



యూనికార్న్ బైక్‌లను గిఫ్టులుగా ఇస్తున్నారు. పందేలు ఆడ్డానికి కోళ్లతో వచ్చిన కొందరు బైక్‌లు గెలిచి రయ్‌మంటూ ఇళ్లకెళ్లారు. అలాగని డబ్బులు ఇవ్వరని కాదు. పందెంలో గెలిచిన డబ్బులతో పాటు బైక్‌లు, కార్ కూడా గిఫ్ట్‌గా ఇస్తున్నారు. వీటన్నిటికన్నా ఎక్కువ పందేలు జరిపిస్తే.. నిర్వాహకులకు కూడా ఎక్కువ కమిషన్ వస్తుంది. అందుకే, ఈ ప్లాన్ వేసినట్టు తెలుస్తోంది.

# పత్రిక రంగంలో అందరి మన్ననలు పొందిన నేటి దినపత్రిక సూర్య పత్రిక

## -సూర్య క్యాలెండర్ నుఆవిష్కరించిన మానుకొండ రాధా కిషోర్, -మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్







**ఖమ్మం (సూర్య బ్యూరో):**
జనవరి 14 ఖమ్మం నగరం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్ నేటి దినపత్రిక సూర్య క్యాలెండర్ ను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో రాధా కిషోర్ మాట్లాడుతూ పత్రిక రంగంలో ప్రజలు మనసులు గెలుచుకున్న నేటి దినపత్రిక సూర్య అని అన్నారు ఈ కార్యక్రమంలో వేపకుంట్ల కాంగ్రెస్ నాయకులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, మోకు దెబ్బ జిల్లా అధ్యక్షులు బండి నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా ఎస్సీ సెల్ నాయకులు అరవికట్ల ప్రేమ్ కుమార్, వేపకుంట్ల కాంగ్రెస్ నాయకులు అరవికట్ల సుధీర్ కుమార్, రఘునాధపాలెం గ్రామ ఎస్సీ సెల్ నాయకులు కొట్టే రాజు, కోటపాడు కాంగ్రెస్ నాయకులు ఎస్ కే. ఆరిఫ్, తదితరులు పాల్గొని నేటి దినపత్రిక సూర్య క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

# సరదాల సంక్రాంతి

## -రంగురంగుల రంగవల్లికలు

## -ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

**తల్లాడ సూర్య మేజర్ న్యూస్:-**
చిన్నారులకు సెలవుల సంబరం,ముగ్గుల్లో ఒదిగిపోయే పల్లెపడుచుల నాజూకు తనం,దాన్య రాశులతో పుష్య లక్ష్మి కళ, పిండి వంటల గుమగుమలు, అల్లుళ్ల వైభోగం,యువకుల కోలాహలం,కళాకారుల ప్రదర్శన..హరిదాసుల సంకీర్తన,అంబరాన ఎగిరే పతంగం,కత్తులు దూసే కోడిపుంజులు ఇవన్నీ కలగలపి పల్లె"టూరు"కు పయనం అయ్యే పట్నంతో సరదాగా సంతోషంగా తెలుగు వారు చేసుకునే అతి పెద్ద పండుగ సంక్రాంతి. ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల ఫోటోలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మహిళా సంఘ సభ్యురాలు శీలం పకీరమ్మ పాల్గొని మాట్లాడుతూ ఇలపై ఇంద్రధనస్సులు విరిసినట్లు, నింగిలోని చుక్కలన్ని నేలపై వాలినట్టు రంగురంగుల రంగవల్లికలు ఆకట్టుకున్నాయని ఆమె అన్నారు.మహిళలు ఉదయం పూట ఇళ్ళ ముందు ముగ్గులు వేయడం మంచి వ్యాయామమన్నారు. దీంతోపాటు మహిళల్లో సృజనాత్మకత



పెరుగుతుందన్నారు.ముగ్గుల పోటీలు ఐక్యతకు,ఆప్యాయతకు నిదర్శనమన్నారు.సంక్రాంతి పండుగ ప్రకృతి పండుగ అని తెలిపారు. సాంస్కృతిక అంశాలు మానసిక వికాసానికి,శారీరక ఆరోగ్యానికి,ఏ కాగ్రతకు ఎంతగానో దోహదపడుతాయని తెలియజేశారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరిగింది.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం మండల అధ్యక్షురాలు స్వరూప,రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి,అయినాల రామలింగేశ్వర రావు,కట్టా దుర్గారావు,వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు దుళ్ల జనార్ధన్, సిఐటియు నాయకులు కట్టా నిర్మల,లక్ష్మి, బహుమతి ప్రదాతలు శీలం సిద్ధారెడ్డి,ఫకీరమ్మ,కోటిరెడ్డి, వెంకట చలపతి రెడ్డి,సామ్రాట్ రెడ్డి, రామశేశిరెడ్డి అధిక సంఖ్యలో మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వికాస తరంగిణి ఆధ్వర్యంలో గోదారంగనాథుల తిరు కళ్యాణ మహోత్సవము





**ఖమ్మం (సూర్య బ్యూరో):**
శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామి వారి దివ్య మంగళా శాసనములతో శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయరుస్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వికాస తరంగీణి ఆధ్వర్యంలో బుధవారం కమాన్ బజారు పుల్లఖండం టవర్స్ లో సామూహిక శ్రీ గోదారంగ నాథుల కళ్యాణ మహోత్సవము అంగరంగ వైభవంగా జరిగింది . అంతకుముందు ఆరాధన , తీర్థ గోష్టి అనంతరం శ్రీకృష్ణ గోశాల పర్యవేక్షణ తర్వాత జడ్పీ సెంటర్ పొలాస్ నుండి ముత్యాలమ్మ గుడి సెంటర్ మీదుగా శోభాయాత్రను నిర్వహించారు . శ్రీ విల్లిపుత్తూరులో విష్ణుచిత్తుడనే ఆళ్వారుకు తులసి వనంలో పసి పాపగా దొరికిన గోదాదేవి సాక్షాత్తు ఆ భూదేవి అవతారమని , చిన్న వయసు నుంచే శ్రీకృష్ణుని గోదాదేవి తన భర్తగా భావిస్తూ , అయన కోసం అల్లిన పూలమాలలను ముందుగా తాను ధరించేది . ఇది చూసి కలవరపడిన విష్ణుచిత్తుడు గోదా దేవిని కోపిస్తే స్వయంగా శ్రీరంగనాయకుడే విష్ణుచిత్తునికి స్వప్నంలో కనిపించి తనకు ఆ మాలలే తనకు ఇష్టమని చెప్పడం జరిగింది . విష్ణుచిత్తునికి కలలో కనిపించిన రంగనాథుడు "విష్ణుచిత్తుడు గోదా దేవిని తీసుకొని మేళతాళాలతో శ్రీరంగం వస్తే సాక్షాత్తూ పాండ్యమహారాజు ఛత్రధ్వజ చామరాదులతో , రత్నాదులచే అలంకరి ంచబడిన దంతపు పల్లకిలో స్వాగతిస్తాడని , అక్కడే తాను గోదాదేవిని వివాహం అడుతాడు . విష్ణుచిత్తుడు కలలో రంగనాయకుడు చెప్పినట్లుగా గోదాదేవిని , విల్లిపుత్తూరులోని ప్రజలనూ తీసుకుని శ్రీరంగానికి బయల్దేరాడు . పెళ్లి కూతురిగా అంతరాలయంలో ప్రవేశించిన గోదాదేవి అందరూ చూస్తుండగానే ఆ రంగనాథునిలో ఐక్యమవుతుంది . పెళ్లి కాలేదని బాధపడుతున్న వారు , వివాహంలో ఆటంకాలు ఎదుర్కొంటున్న వారు భక్తిశ్రద్ధలతో శ్రీ గోదా రంగనాథుల కల్యాణం చూస్తే అవివా హితులకు కళ్యాణ ప్రాప్తి కలుగుతుందని , అలాగే భార్య భర్తల మధ్య అపార్ధాలు ఉంటే తొలగిపోయి అన్యోన్య దాంపత్యం సిద్ధిస్తుంది సకల శుభాలను పొందుతారు . ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పోల శ్రీనివాస్ , సభ్యులు భోజట్ల శాంతి శ్రీ , దొడ్డపనేని సాంబశివరావు , రవీంద్ర , మైత్రి , జెట్ల ప్రీతి రాణి , ఉష , లక్ష్మీనారాయణ , కోట్ల మాధవరావు , పుల్లఖండం శ్రీరాములు పాల్గొన్నారు .

# నాగరాజు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న

## -సిపిఐ(ఎం)పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు బృదం





**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**
మండలంలోని నాచేపల్లి గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) సానుభూతిపరుడు గోగుల నాగరాజు(35) బుధవారం మరణించారు. ఆయన గత కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరాజు ఆకస్మిక మరణం పార్టీ అభివృద్ధికి తీరని లోటు అన్నారు.నాగరాజు విద్యార్థి దశ నుండి ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐలో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ పట్ల అత్యంత విశ్వాసం,అంకితభావంతో పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు.నాగరాజు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో పార్టీ మండల నాయకులు కూరపాటి ప్రసాద్,దండా సూర్యనారాయణ, సీనియర్ నాయకులు మందడి కోదండ రామారావు,శాఖ కార్యదర్శి పొన్నం శివరాజు, జే దేవసాయం,ఆర్ రవి,టి దేవరాజు,టి కోటేశ్వరరావు,టీ.ప్రకాశం, నరసింహారావు,అవినాష్, మాధవరావు,రామలక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

# ఉప ముఖ్యమంత్రి భట్టిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన

## - కాంగ్రెస్ పార్టీ నాయకులు దోసపాటి,రేగూరి



**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**
నూతన సంవత్సర,సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క ని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నేలకొండపల్లి ఆర్య సంఘ పట్టణ మరియు మండల అధ్యక్షులు దోసపాటి చంద్రశేఖర్,రేగూరి హనుమంతరావు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనవసరం డిప్యూటీ సీఎం కి శాలువా కప్పి సత్కరించారు.అందరూ బాగున్నారా అని ఆప్యాయతగా పలకరించిన డిప్యూటీ సీఎం భట్టి.మీరందరూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం పెద్దల దృష్టికి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో అందరూ ఆనందంగా ఉండాలని కోరారు.కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వారిని ఎప్పుడూ మర్చిపోనని చెప్పారు. ఉప ముఖ్యమంత్రిని కలిసి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన వారిలో నాయకులు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఎన్నిక కోసం సన్నాహక సమావేశం



**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల అమలు పై బుధవారం వివిధ శాఖల సిబ్బందితో మండలం కేంద్రంలో లోని రైతు వేదికలో అవగాహన సమావేశం ను నిర్వహించారు.రైతు భరోసా,ఇందిరమ్మ ఇళ్ల అమలు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,కొత్త రేషన్ కార్డుల జారీ పై ప్రత్యేక అధికారాలు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి క్షేత్ర సిబ్బంది వ్యవసాయ శాఖ సిబ్బంది కి దిశ నిర్దేశం చేశారు. పథకాల అమలకు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలని తెలిపారు.

16వ తేదీ నుంచి 20వరకు గ్రామాల్లో క్షేత్ర పరిశీలన చేయాలని అనంతరం పథకాలకు అర్హుల ఎంపిక ప్రక్రియపై 21 నుంచి నాలుగు రోజుల పాటు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యం.యర్రయ్య,తాసిల్దార్ జె. మానిక్ రావు పేర్కొన్నారు.గ్రామల వారిగా వ్యవసాయ వ్యవసాయేతర భూములు, నాలా మార్పిడి,ప్రభుత్వ భూమి వివరాలను నివేదికలో పొందపరచాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు,వ్యవసాయ శాఖ మండల అధికారిని యం.రాధా,మండల విద్యాశాఖ అధికారి బాలిన చలపతిరావు,సివిల్ సప్లై ఆర్ఐ నరేష్,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మధుసూదన్, ఏపిఓ సూనిత మండల పంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది,ఉపాధి క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కైట్స్ ఫెస్టివల్..



**అన్నపురెడ్డిపల్లి, సూర్య(మేజర్‌న్యూస్)** - మండల కేంద్రంలోని శ్రీ శ్రీ అంకమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో మంగళవారం మకర సంక్రాంతిను పురస్కరించుకొని హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మారగాని శ్రీనివాసరావు కైట్స్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు వనమా గాంధీ, హరిహర ఫౌండేషన్ సభ్యులు చిన్నారులకు గాలిపటాలు అందజేసి పండుగను ప్రారంభించారు. అనంతరం పతంగుల పండుగను వీక్షించేందుకు వచ్చిన వారందరికీ స్వీట్స్ (అరిసెలు) పంపిణీ చేసి మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వనమా గాంధీ మాట్లాడుతూ గ్రామాల్లో సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కైట్ ఫెస్టివల్ ఏర్పాటు చేస్తున్న అధ్యక్షులు మారగాని శ్రీనివాసరావుకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. సంక్రాంతి అంటేనే సంబరాల పండుగ అని పిల్లలు పెద్దలు అందరూ కలిసి గాలిపటాలు ఎగరవేస్తూ ఆనందంతో గడుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ అంకమ్మ తల్లి ఆలయ కమిటీ అధ్యక్షులు పానుగంటి రాఘవులు, హరిహర ఫౌండేషన్ సభ్యులు చల్లా రమేష్, చల్లా లక్ష్మణరావు, గుణగంటి శ్యామ్, గ్రామ పెద్దలు షేక్ నసురుద్దీన్, భీముడు, ఎమ్మెస్సార్ యూత్ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ

### ఆవిష్కరించిన టిడిపి రాష్ట్ర నాయకులు నర్సింహులు,నర్సిరెడ్డి







**జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్)**- మండలంలోని కాకర్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కన్వీనర్ బక్కిని నరసింహులు, టీటీడీ పాలకమండలి సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి, వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా టిడిపి శ్రేణులు జూలూరుపాడు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కాకర్ల చేరుకున్నారు. విగ్రహ ప్రారంభోత్సవాన్ని నరసింహులు, నర్సిరెడ్డి,రాందాస్ నాయక్, రామనాథం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.అనంతరం వేదికపై అతిథులు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి అధికారానికి దూరంగా ఉన్న బడుగు బలహీన వర్గాల ప్రజలకు నాయకత్వాన్ని అందించారన్నారు.ఆయన ముఖ్యమంత్రిగా అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, పటేల్, పట్వారి వ్యవస్థలను రద్దు చేశారని పేర్కొన్నారు.మండలి వ్యవస్థను,రెసిడెన్షియల్ స్కూళ్లను ఎన్టీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు.మహిళలకు ఆస్తి హక్కు ను కల్పించిన మహనీయుడని కొనియాడారు.తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని పునర్మించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.తెలుగుదేశం పార్టీ సహకారంతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని,బిఆర్ఎస్ పార్టీ ఓటమి లక్ష్యంగా గత ఎన్నికల్లో తెదేపా క్రియాశీలకంగా వ్యవహరించిందన్నారు.తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో పునర్ వైభవం తెచ్చే విధంగా ప్రణాళికను రూపొందించాలని తెలిపారు.మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంటరీ ఉపాధ్యక్షులు ఆరెం రామయ్య,జిల్లా మాజీ అధ్యక్షులు కూరపాటి వెంకటేశ్వర్లు,ఏన్కూర్ మాజీ ఎంపీటీసీ ఆరెం వరలక్ష్మి,వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ చలపతి,తాతా సుధాకర్,తాలూరి అప్పారావు, కొనకంచి రామకృష్ణ, మండేపూడి రామారావు,సురేందర్, రోకటి రంగారావు,తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు, చలమల గోవిందు, వడ్డే వెంకటనారాయణ, పెంటికల వీరబాబు,సాయిని నాగేశ్వరరావు,పొదిలి రామారావు, బెల్లంకొండ రామకృష్ణ, మంగముడి నాగేశ్వరరావు,తాలూరి నవీన్, రమేష్,కొండెం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలపై నిజామాబాద్ ఎంపీ అరవింద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన మాజీ జడ్పీటిసి పైడి



**దమ్మపేట, సూర్య (మేజర్ న్యూస్ )**- నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిన సందర్భంగా నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరావు పై చేసిన అనుచిత వ్యాఖ్యలను జిల్లా రాజకీయ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటిసి పైడి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంటే అభివృద్ధికి బాటలు వేసే ఒక బ్రాండ్ అని ఆయన గురించి పూర్తిగా తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని ఆయన అన్నారు. ఆయన 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో అభివృద్ధి శ్వాసగా... ప్రజా సంక్షేమమే బాటగా నిలిచారని అన్నారు. ప్రజా నాయకుడు తుమ్మలపై ఎంపీ ధర్మపురి అరవింద్ చేసిన వ్యాఖ్యలు అవివేకమని ఆయన ఎద్దేవా చేశారు. ఆయనపై ఎటువంటి వ్యాఖ్యలు చేసిన మారుమూల గిరిజన బిడ్డ కూడా పులిలా గాండ్రిస్తాడని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. బీటల బారిన భూములను సస్యశ్యామలం చేసే రైతు బాంధవుడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అని నిత్యం ప్రజా క్షేమం కోరే మహా నాయకుడిపై వ్యాఖ్యలు చేయడం సహించలేనిదన్నారు. నిస్వార్ధ ప్రజా సేవకుడిగా పేరు గడించిన మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు జీవితం ప్రజాసేవకు అంకితం చేశారని అన్నారు. ఎంపీ అరవింద్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మాజీ జెడ్పీటిసి పైడి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

## కురుమ సంఘం ఆధ్వర్యంలో నాలుగు జిల్లాల స్థాయి కబడ్డీ క్రికెట్ పోటీలు







### భారీ సంఖ్యలో పాల్గొన్న కురుమ సంఘం క్రీడాకారులు

**చంద్రుగొండ సూర్య (మేజర్ న్యూస్)**- కురుమ సంఘం ఆధ్వర్యంలో నాలుగు జిల్లాల స్థాయి క్రికెట్, కబడ్డీ, పోటీలను ఘనంగా నిర్వహించారు. మకర సంక్రాంతిని పునస్కరించుకొని చంద్రుగొండ మండలం దామరచర్ల గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లా, ఎన్టీఆర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఖమ్మం జిల్లాకు, చెందిన కురుమ క్రీడాకారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించిన ఈ క్రీడల్లో క్రికెట్ ప్రథమ స్థానం బహుమతి దామరచర్ల, తృతీయ బహుమతి మర్లపాడు టీం సభ్యులు గెలుపొందారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం లక్ష్మీపురం ద్వితీయ స్థానం పెద్ద మునగాల తృతీయ స్థానం దామరచర్ల క్రీడాకారులు గెలుపొందారు. గెలుపొందిన క్రీడాకారులు అందరికీ కురుమ సంఘం నాయకులు ప్రైజ్ మనీతో పాటు మెమొంటులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాకులు సానిక మల్లేష్ (కురుమ సంఘం అధ్యక్షుడు), అచ్చన వెంకటేశ్వర్లు (ఉపాధ్యక్షుడు), సానిక నాగరాజు( ప్రధాన కార్యదర్శి), బీరకాయల బాబురావు ( కోశాక అధికారి), జడ రామ్ మహేష్ (యూత్ లీడర్), చింతల నాగేశ్వరరావు, సానిక రామ్ మహేష్, కంచరపల్లి నరసిహారావు, చింతల లక్ష్మణ్ రావు, బన్నే అశోక్, యల్లగా సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్,ఆర్యవైశ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

### ప్రతి ఇంటి ముందు ఘనంగా సంక్రాంతి ముగ్గుల హరివిల్లు

### ఉచిత గాలిపటాల పంపిణీ






**ఇల్లందుటౌన్,సూర్య (మేజర్‌న్యూస్)** - సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఇల్లందు వాసవి క్లబ్, ఆర్యవైశ్య మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఉచిత గాలిపటాలను పంపిణి చేశారు. వాసవి క్లబ్, ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు ఉదయం 7 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మహిళా శానిటేషన్ సిబ్బంది వేసిన ముగ్గులను పరిశీలించి ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. అనంతరం గోవింద్ సెంటర్, బుగ్గ వాగు బ్రిడ్జి సెంటర్, ఆమ్ బజార్, మెయిన్ రోడ్డు మీదుగా గవర్నమెంట్ హాస్పిటల్ వరకు వెళ్లి మహిళలు తమ ఇంటి ముంగిళ్ళలో వేసినటువంటి ముగ్గులను పరిశీలించి అందంగా తమ ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దిన 20 మంది మహిళలకు వివిధ రకాలైన ఆకర్షణీయమైన బహుమతులను అందించారు. అదేవిదంగా మెయిన్ రోడ్ సెంటర్‌లో కటకం సెలక్షన్స్ వస్త్ర దుకాణం ముందు చిన్నారులకు ఉచితంగా గాలిపటాలు, దారాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ నూతన అధ్యక్షులు బోనగిరి రవి కిరణ్, ప్రధాన కార్యదర్శి కటకం సత్యేంద్ర కుమార్, కోశాధికారి తీర్థాల నాగరాజు, జిల్లా, మండల, పట్టణ, యువజన ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు, వాసవి క్లబ్ సభ్యులు ఎలుగూరి నగేష్ కుమార్, పల్లెర్ల చంద్రశేఖర్, ఇల్లందు నియోజకవర్గ ఫెర్టిలైజర్ సంఘ అధ్యక్షులు ప్రొద్దుటూరు నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, అనుబాబు, తాటిపల్లి సుబ్బారావు, ఎలుగూరి మధుబాబు, పుల్లూరు సతీష్ కుమార్, సైఫా రాజశేఖర్, పసుమర్తి వాసు, జొన్నల ఉపేంద్రనాథ్, గందే సురేష్, ఓరుగంటి పవన్ కుమార్, కటకం సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలి

### టిబిజికెఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ



**కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)**- ఈ నెల 26వ తేదీ నుంచి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తెల్ల రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించడం జరిగిందని, సింగరేణి సంస్థలో పనిచేసి పదవి విరమణ చేసిన ఉద్యోగులకు కూడా రేషన్ కార్డులు షరతులు లేకుండా తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపుకృష్ణ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనలో నమోదు చేసిన ఆధారాల ప్రకారం దరఖాస్తున్నా వారి అందరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఎలాంటి నిబంధనలు లేకుండా సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయిన వారికి కూడా ఎలాంటి కండీషన్లు పెట్టకుండా ఇవ్వాలని డిమాండ్ చేసారు. అంతేకాకుండా డీఎల్ కార్మికులకు ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇవ్వాలని, రేషన్ కార్డులు ఉన్నవారికి వాళ్ల పిల్లల పేర్లను కూడా నమోదు చేయాలని కోరారు.